క్లుప్తంగా

బాల ఆధార్‌పై చొరవ చూపండి



అంగరలో బాల ఆధార్ శిబిరంలో వివరాల నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కపిలేశ్వరపురం: పుట్టిన బిడ్డల వివరాలతో ఆధార్ నమోదు చేయించేందుకు సచివాలయ ఉద్యోగులు చొరవ చూపాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. అందుకోసం క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. మండలంలోని అంగర సచివాలయం -01లో నిర్వహిస్తున్న బాల ఆధార్ నమోదు శిబిరాన్ని ఆయన సందర్శించారు. బాలల వివరాలను నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. శిబిరాన్ని కార్యదర్శి కామేశ్వరరావు పర్యవేక్షించారు. సచివాలయ ఉద్యోగులు శిబిరంలో సేవలందించారు.

అంగర పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు



అంగర పీహెచ్‌సీలో వైద్యాధికారితో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌ఓ దొర

కపిలేశ్వరపురం: క్షేత్రస్థాయిలో వైద్య, ఆరోగ్య ఉద్యోగులు, సిబ్బంది వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.దుర్గారావుదొర అన్నారు. మండలంలోని అంగర పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి పీహెచ్‌సీలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు అందుతున్న ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సేవలను ఆయన పరిశీలించారు. ప్రసూతి థియేటర్, రిజిస్టర్లు, మందులు, సిబ్బంది హాజరును పరిశీలించి సూచనలు చేశారు. అందుతున్న సేవలపై రోగులను ఆరా తీశారు. ఆయన వెంట డీఎం అండ్‌హెచ్‌ఓ కార్యాలయం, స్థానిక పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

వరి విత్తనాలకు ఇండెంట్ సిద్ధం చేయాలి



వెంకటాయపాలెం ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: ఖరీఫ్‌లో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రైతులకు అవసరమైన వరి విత్తనాల కోసం రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వారీగా ఇండెంట్ సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. తోటపేట, హసన్‌బాద, వెంకటాయపాలెం ఆర్‌బీకేలను మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఆర్‌బీకేలలోని కియోస్కులకు ప్రతి రోజూ తప్పనిసరిగా ఆన్ చేయాలని చెప్పారు.

పర్యాటకులను ఆకట్టుకునేలా బీచ్ అభివృద్ధి

కాకినాడ రూరల్: సందర్శకులను ఆకట్టుకునేలా సూర్యారావుపేట బీచ్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, రెవెన్యూ, టూరిజం, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) అధికారులతో కలసి ఆమె బీచ్ పార్కు, శిల్పారామం, హరిత రిసార్ట్స్, రెస్టారెంట్, ఓపెన్ యాంఫీ థియేటర్, ఫౌంటెయిన్, ఓపెన్ సైట్లు, ల్యాండ్ స్కేప్, నిర్మాణంలో ఉన్న గదులు, యుద్ధ విమానాల మ్యూజియాన్ని పరిశీలించారు. బీచ్ పార్కు నిర్వహణ మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై టూరిజం ఈఈ రాజారావు, ఏపీటీడీసీ అధికారులు, తహసీల్దార్ మురార్జీతో చర్చించారు. ఖాళీ స్థలాలు, ఏయే పనులకు ప్రతిపాదించారనే విషయాలను మండల సర్వేయర్ వేణుగోపాలాచార్యులు వివరించారు. యుద్ధ విమానాల మ్యూజియంలో సందర్శకుల కోసం సిద్ధమవుతున్న టీయూ-142 యుద్ధ విమాన లోపలి భాగాన్ని కలెక్టర్, జేసీ స్వయంగా పరిశీలించారు. జరుగుతున్న పనుల వివరాలను కౌడా వైస్ చైర్మన్ కె.సుబ్బారావు తెలిపారు. కౌడా ద్వారా చేపట్టే పనుల డిజైన్లను కలెక్టర్‌కు వివరించారు. జూలై నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఫ్రూట్ పార్కులో పిల్లల కోసం వినోద పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. సందర్శకులకు పబ్లిక్ టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీచ్ పార్కుకు ఎదురుగా ఏర్పాటు చేసే ఈట్ స్ట్రీట్‌లో సౌకర్యాలు కల్పించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ పార్కుకు దక్షిణం వైపు ఏర్పాటు చేసే గేమింగ్ జోన్‌లో ఫ్లైట్ స్టిమ్యులేటర్, జీరో గ్రావిటీ రూమ్, రోలర్ కోస్టర్ వంటి ఆధునిక వినోద పరికరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

ఎట్టకేలకు సొంత గూడు

- సాకారమవుతున్న చిరకాల కోరిక
- హెడ్ పోస్టాఫీసుకు త్వరలో సొంత భవనం
- రూ.3.74 కోట్ల మంజూరు
- 42 ఏళ్లకు కార్యరూపం



హెడ్ పోస్టాఫీసు సొంత భవనం నిర్మించేదిక్కడే..



ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయం

రామచంద్రపురం: చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరనుంది. రామచంద్రపురం పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయానికి సొంత గూడు త్వరలో సమకూరనుంది. ఈ భవనం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.3.74 కోట్లు మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హెడ్‌పోస్టాఫీసుకు సొంత భవనం నిర్మాణం దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. దీనిపై పట్టణ వాసులతో పాటు రామచంద్రపురం హెడ్‌పోస్టాఫీస్ పరిధిలోని తపాలా ఖాతాదారులు, ఆ శాఖ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాలుగా ప్రయత్నాలు

రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం ప్రధాన తపాల కార్యాలయాన్ని 1976లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచీ రామచంద్రపురం పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలో 14 సబ్ పోస్టాఫీసులు, 59 బ్రాంచి పోస్టాఫీసుల ద్వారా తపాలా సేవలు అందిస్తున్నారు. తొలి నుంచీ ఈ హెడ్ పోస్టాఫీస్ అద్దె భవనంలోనే కొనసాగుతూ వస్తోంది. ఇక్కడి నుంచే సబ్, బ్రాంచి పోస్టాఫీసులకు వివిధ సేవలు అందిస్తున్నారు. ఉత్తరాల బటాడా, ఆర్థిక లావాదేవీలను కూడా ఇక్కడి నుంచే నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయానికి పట్టణంలో సొంత భవనం సమకూర్చేందుకు 1981లో అప్పటి తపాలా ఉద్యోగులు ప్రయత్నాలు చేశారు. దీని కోసం అప్పట్లో పట్టణానికి చెందిన ఒక దాత తోటవారి వీధి సమీపాన రాజకోట స్కూల్‌ను ఆనుకుని 55 సెంట్ల స్థలాన్ని దానం చేశారు. అక్కడ ఉన్న రోడ్డుకు ఒకవైపు 22 సెంట్లు, మరోవైపు 33 సెంట్ల స్థలాన్ని అందజేశారు. దీంతో 42 ఏళ్ల క్రితమే హెడ్ పోస్టాఫీసుకు సొంత స్థలం సమకూరింది. అప్పటి నుంచీ తపాలా అధికారులు స్థానికంగా ఉండే ఉద్యోగ సంఘాల నాయకులు సొంత భవన నిర్మాణానికి ఎంతో కృషి చేశారు.

పీఎంజీ, మంత్రి, ఎంపీ చొరవతో..

హెడ్ పోస్టాఫీసుకు సొంత భవనం నిర్మాణంపై ఏడాదిన్నర క్రితం అప్పటి విశాఖపట్నం పోస్ట్‌మాస్టర్ జనరల్(పీఎంజీ)గా పని చేసిన జిల్లా వాసి ముత్యాల వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అలాగే దీనిపై రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ చింతా అనురాధ ప్రత్యేకంగా చొరవ చూపారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.3.74 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆ శాఖ అధికారులు హెడ్ పోస్టాఫీసుకు సొంత భవన నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఈ భవన నిర్మాణానికి అవసరమైన మున్సిపల్, అన్ని రకాల సాంకేతిక అనుమతులూ తీసుకున్నారు. త్వరలోనే భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. తోటవారి వీధిలోని రాజకోట స్కూల్‌ను ఆనుకుని ఉన్న 22 సెంట్ల స్థలంలో ఈ భవనాన్ని నిర్మించనున్నారు.

ఆనందంగా ఉంది



ప్రధాన తపాలా కార్యాలయం సొంత భవనం నిర్మాణానికి యూనియన్ పరంగా సుమారు 42 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూ వచ్చాం. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవ కారణంగా నేటికి నిధులు మంజూరు కావటం ఆనందంగా ఉంది. సబ్ డివిజన్ పరిధిలోని హెడ్ పోస్టాఫీసుకు సొంత భవనం సమకూరటంతో ఉద్యోగులతో పాటు ప్రజలకు మరింతగా మెరుగైన సేవలు అందించే వీలు కలుగుతుంది.

– జీవీకేజీబీవీ రామయ్య, ఏఐజీడీఎస్ ఉద్యోగ సంఘం నేత

త్వరలోనే నిర్మాణ పనులు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని అనుమతులూ తీసుకుంటున్నాం. త్వరలోనే హెడ్ పోస్టాఫీస్ భవన నిర్మాణ పనులు జరగనున్నాయి. సొంత భవనం సమకూరితే శాఖాపరంగా ఇంత కాలం నుంచి ఎదుర్కొంటున్న సమస్యలు తీరనున్నాయి.

– ఎం.లక్ష్మణ్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం సబ్ డివిజన్

'పెంట్ హౌస్' షూటింగ్ సందడి



యనమదల గ్రామంలో వెబ్ సిరీస్ షూటింగ్

రామచంద్రపురం రూరల్: లక్కీ కిషన్స్ ఇండియా బ్యానర్‌పై నిర్మిస్తున్న 'పెంట్ హౌస్' వెబ్ సిరీస్ షూటింగ్ సందడి మంగళవారం యనమదల గ్రామంలో ప్రారంభమైంది. పట్టణానికి చెందిన డొంకా మణికంఠ పవన్ (లక్కీ) రచించిన కథను స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తూ నిర్మిస్తున్నారు. మండపేటకు చెందిన సుధ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ వెబ్ సిరీస్‌లో పి.అభిరామ్, మణికంఠరెడ్డి, షణ్ముఖ, బన్నీ, కర్రి రామారెడ్డి, మేడపాటి సుబ్బారెడ్డి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతం వినీల్ అందిస్తున్నట్టు కాస్టింగ్ డైరెక్టర్ కర్రి రామారెడ్డి తెలిపారు.

బీరువా కంపెనీ తొలగించాలని వినతి

మండపేట: గాంధీనగర్‌లో నివాసాల మధ్యలో ఉన్న బీరువాల తయారీ కంపెనీని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీరువాలు, షెల్ఫుల తయారీ, వాటికి పెయింటింగ్ వేసే సమయంలో శబ్ద, వాయు కాలుష్యంతో చుట్టుపక్కల నివాసితులు, దారిన వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు ఒక ప్రకటనలో తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్..

తుప్పలతో తిప్పలు



కోట రోడ్డులో ఏపుగా ఎదిగిన తుప్పలు

ఏటిగట్టు రోడ్డుపై ఇరువైపులా పెరిగిన తుప్పలతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. ఇటీవల అడపాదడపా కురిసిన భారీ వర్షాలకు కోటిపల్లి నుంచి కోట వరకూ ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా పెరిగాయి. ఈ రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉండటం, దీనికి తోడు తుప్పలు రోడ్డు మధ్య వరకూ విస్తరించడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. గతంలో తుప్పలను తొలగించినా వర్షాల కారణంగా మళ్లీ అవి పెరిగిపోయాయని, వీటిని పూర్తి స్థాయిలో తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. – కె.గంగవరం

పథకాలకు పేదరికమే ప్రామాణికం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ..



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: కులమతవర్గాలు, పార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన ఆ గ్రామంలో పర్యటించారు. జమ్మిచెట్టు వీధి, పంచాయతీ రోడ్డు తదితర ప్రాంతాల్లో తోట త్రిమూర్తులు ఇంటింటికీ వెళ్లి స్థానికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ ప్రజలను ఆరా తీశారు. స్థానికుల ఆయన దృష్టికి తెచ్చిన ఆయా సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓ ఐ.రాజు, గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ మూడేళ్లలో చేసిన ప్రగతిని వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అయ్యేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఇలాంటి సంక్షేమ పాలనను మునుపెన్నడూ చూడలేదని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, జేసీఎస్ టౌన్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు సలాది వీరబాబు, తాతపూడి రాజేష్, బూరిగ జానీ, రామిశెట్టి ఫణి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన బస్ షెల్టర్



బస్ షెల్టర్‌లో కాపురముంటున్న బరకాల వ్యాపారి

కాజులూరు: కుయ్యేరులో ప్రయాణికుల కోసం నిర్మించిన బస్ షెల్టర్ ఆక్రమణలకు గురై, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. యానాం - ద్వారపూడి రోడ్డులో కుయ్యేరు జంక్షన్ వద్ద 20 ఏళ్ల క్రితం ఈ బస్ షెల్టర్‌ను నిర్మించారు. కుయ్యేరు, చింతలంక, రేగుబాడవ, పాలమూరుపాడు తదితర గ్రామాలతో పాటు కె.గంగవరం మండలానికి చెందిన పలు గ్రామాల ప్రయాణికులు కాలినడకన ఇక్కడకు వచ్చి బస్సు ఎక్కుతూంటారు. వారికి ఈ బస్ షెల్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. రెండు భాగాలుగా ఉన్న ఈ బస్ షెల్టర్‌లోని కొంత భాగాన్ని ఇటీవల గుంటూరు నుంచి వచ్చిన ఒక వ్యాపారి ఆక్రమించుకున్నాడు. అందులోనే కాపురముంటూ బరకాలు అద్దెకు ఇచ్చే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మిగిలిన భాగంలో పరిసర దుకాణదారులు సైకిళ్లు, మోటార్ సైకిళ్లు నిలుపుతున్నారు. మరోపక్క మందుబాబులు కూడా ఈ బస్ షెల్టర్‌లో తరచూ మద్యం తాగుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ వెనుక భాగంలో అప్పట్లో మరుగుదొడ్లు నిర్మించారు. ప్రతి రోజూ బస్ షెల్టర్ సైకిళ్లతో నిండుగా ఉండటం, మందుబాబులు తిష్ట వేస్తూండటంతో మరుగుదొడ్లను మహిళలు ఉపయోగించుకునే వీలు లేకపోతోంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. బస్ షెల్టర్ ఆక్రమణలకు గురవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, తీవ్ర ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రంథాలయంలో ప్రతిభా పోటీలు



విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, చదరంగం పోటీలు నిర్వహించారు. పలు సామాజిక అంశాలపై విద్యార్థులు గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సర్పంచ్ సాకా శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శి సాయి ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, ఉపాధ్యాయురాలు లక్ష్మి అభినందించారు.

ఇంగ్లిష్ పరీక్షకు సంస్కృత పరీక్ష హాల్ టికెట్

సరి చేసిన అధికారులు

మండపేట: ఇంటర్మీడియెట్‌లో ఇంగ్లిష్ బెటర్‌మెంట్ రాసేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థికి సంస్కృత పరీక్ష హాల్ టికెట్ రావడం ఆందోళనకు గురి చేసింది. పట్టణానికి చెందిన జేపీవీ నాయుడు స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివాడు. ఇంగ్లిషులో 86, సంస్కృతంలో 99 చొప్పున మార్కులు వచ్చాయి. ఇంగ్లిష్ బెటర్‌మెంట్ రాసేందుకు ఫీజు చెల్లించగా కళాశాల సిబ్బంది నిర్వాకంతో రెండు రోజుల క్రితం అతడికి సంస్కృతం పరీక్షకు హాల్ టికెట్ వచ్చింది. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులు ప్రవీణ్ ప్రకాష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జూన్ 1వ తేదీ వరకూ నిర్వహించనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మొదటి ఏడాది విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ, రెండో ఏడాది విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించకూడదనే నిబంధన ఉన్న నేపథ్యంలో కేంద్రానికి విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్‌గా కేవీఆర్ కృష్ణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పి.రామాంజనేయులు వ్యవహరిస్తారని తెలిపారు.

నందీశ్వరుడి శిరస్సుపై వానరం



నందిపై కూర్చుని సందడి చేస్తున్న కొండముచ్చు

మండలంలోని నదురుబాద శివాలయంలో మంగళవారం ఓ వానరం సందడి చేసింది. కొండముచ్చు జాతికి చెందిన వానరం ఆలయంలోని శివుడి విగ్రహానికి ఎదురుగా ప్రతిష్ఠించిన నంది తలపై కూర్చుంది. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా గమనించారు.

–రాయవరం

గురి చూసి కొట్టాలిరా



డీఎస్ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- రైఫిల్ షూటింగ్‌లో చిన్నారులకు శిక్షణ
- అకాడమీలో తరగతులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దీపావళి వచ్చిందంటే డమ్మీ తుపాకులు పట్టుకుని టోపీలు పేల్చుతూ సంబరపడే చిన్నారులు.. దొంగా పోలీస్ ఆటలు ఆడేటప్పుడు శబ్దాలు చేస్తూ నిజంగానే తుపాకీతో కాల్చుతున్నట్లు ఊహించుకుని ఆనందపడే బుడతలు షూటింగ్‌లో శిక్షణ పొందడానికి ఉత్సాహం చూపుతుంటారు. అలాంటి వారి కోసం వేసవి శిక్షణ మొదలైంది. దేశానికి షూటింగ్‌లో పతకాలు తెచ్చిన అభినవ్ బింద్రా, విజయ్, జీతూ రాయి, అంజలీభగవత్‌లను స్ఫూర్తిగా తీసుకుని రైఫిల్ షూటింగ్‌పై ఉన్న మక్కువతో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో కోచ్ సమీర్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 7 నుంచి ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో భాగంగా రైఫిల్ షూటింగ్ అకాడమీలో సుమారు 12 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. 10 మీటర్ల రేంజ్ ఉన్న ఈ అకాడమీలో కోచ్ సమీర్ క్రీడాకారులకు రైఫిల్ షూటింగ్‌లో మెళకువలు నేర్పుతున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకూ శిక్షణ ఇస్తున్నారు. అకాడమీలో రెండు గన్స్, ఒక తుపాకీ ఉన్నారు. వీటితోనే హ్యాండ్ పవర్, బ్యాలెన్స్, ఐసైట్, స్టాండింగ్ పొజిషన్‌లలో తర్ఫీదు ఇస్తున్నారు. అయితే క్రీడాకారులకు మెరుగైన శిక్షణ కావాలంటే శాప్ నుంచి అంతర్జాతీయ స్థాయి 4 రైఫిల్స్, 4 పిస్టల్స్ వంటివి కావాల్సి ఉంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ టార్గెట్‌లు వాడుతున్నారు. మొత్తం 5 ఉండగా అందులో రెండు పాడై మరమ్మతులు చేయక వినియోగంలో లేకుండా పోయాయి. వీటి స్థానంలో ఆధునిక సిస్టమ్ టార్గెట్‌లు ఏర్పాటు చేస్తే మరింత మంది శిక్షణ పొంది పతకాలు సాధించడానికి అవకాశం ఉంటుందని కోచ్ చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఈ అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులు ఆరు బంగారు, నాలుగు రజత, ఒక కాంస్య పతకం సాధించారు.

ఏకాగ్రత అవసరం



రైఫిల్ షూటింగ్‌లో రాణించాలంటే సహనం, ఓపిక ఉండాలి. ఈ క్రీడ ఏకాగ్రతతో కూడుకున్నది. టార్గెట్‌పైనే దృష్టిసారిస్తే పతకం సాధించడం సులువే. ఈ క్రీడల్లో రాణించే వారికి విద్య, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

– సమీర్, రైఫిల్ షూటింగ్ కోచ్, డీఎస్ఏ

తండ్రి ప్రోత్సాహంతో...



నా పేరు శ్రీయ జీవిత. నేను ఆదిత్య స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నా. జాతీయ స్థాయిలో రైఫిల్ షూటింగ్‌లో పతకం సాధించడమే నా లక్ష్యం. మా తండ్రి ప్రోత్సాహంతో సమ్మర్ క్యాంప్‌లో చేరాను.

– శ్రీయజీవిత, 7వ తరగతి

మూడేళ్లుగా శిక్షణ



నేను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. డీఎస్ఏలో మూడేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించాను. ఐఐటీలో సీటు పొంది కెరీర్‌లో స్థిరపడాన్నది నా జీవిత లక్ష్యం.

– మోహియుద్దీన్ షేక్, ఇంటర్ విద్యార్థి